రచన: డి.పద్మజ

# స్వామి భక్తి (కథ)

కూరల బండి వాడి కేక విని ప్లాస్టిక్ బుట్ట,పది రూపాయిల నోటు తీసుకుని వీధి లోకి వచ్చాను. చామ దుంపలు పావు కిలో, దొండకాయలు అర కిలో, సొర కాయ ముక్క, కరివేపాకు, రెండు నిమ్మకాయలు వచ్చాయి ఆ పదికి.

కూరలు కొంటున్నంత సేపు నేవా కుక్క వంక చూస్తూనే వున్నాను. మా ఇంటికి నాలుగిళ్ల అవతల పేవ్‌మెంట్ మీద కూర్చుని వుంది ఆగి

తెల్ల రంగు పమేరియన్ డాగ్స్‌ని ఎన్నిటినో చూశా కాని పింక్ రంగుది చూడడం అదే మొదలు. వాటిలో పింక్ రంగు కూడా వుంటుందని నాకు తెలీదు. మెళ్ళో బెల్ట్, లైసెన్స్ బిళ్ల.

అది గణేశ్ ఇంటివైపు చూస్తూ కూర్చుని వుంది పేవ్‌మెంట్ మీద.

చామ దుంపలు ఉడకబెట్టి తొక్క వలిచాక ఆ తొక్కుని పారబోయడానికి గంటన్నర తర్వాత బయటికి వచ్చిన ప్పుడు చూస్తే ఇంకా అది అక్కడే వుంది. అలాగే గణేష్ ఇంటి వంక చూస్తూ కూర్చునే వుంది.

సాయంత్రం మూడు ముప్పావుకి పిల్లలు స్కూల్ నుంచి వచ్చే రిక్షా బెల్ విని టి.వి. ఆపేసి బయటికి వెళ్లాను.

"అమ్మా ఆ కుక్క చూడు ఎంత బావుందో" చెప్పింది మా ఆఖరమ్మాయి. అదింకా కదలకుండా ఆదే హెచ్.ఎం.వి. భంగిమలో కూర్చుని వుంది. ఆరున్న రకి శ్రీవారు వచ్చారు. స్కూటర్ పార్క్ చేసి ఇంట్లోకి వచ్చి రెయిన్ కోటు విప్పి చెప్పారు.

"వర్షంలో తడుస్తూ ఎలా కూర్చుందో ఆ కుక్క. ఎవరిదో అది?"

ఆశ్చర్యం! కిటికీలోంచి తొంగి చూస్తే అలాగే కూర్చునుంది. ఆ కుక్క, శిల్పి చెక్కిన బొమ్మలా, అణు మాత్రం కూడా కదలకుండా, మొదటిసారి ఉదయం నే చూసిన భంగిమలోనే కూర్చుని వుంది. ఎందుకలా గణేశ్ ఇంటి వంక చూస్తూ కూర్చుంది? నేమూ, మా వారు ఆ విషయం చర్చించుకున్నాం.

"కుక్కకి విశ్వాసం ఎక్కువ. ఆ గణేశ్ ఎంత లుచ్చానో ఈ సందులో అందరికీ తెలిసిందేగా"

మా ఇంట్లో ముందు గదిలోని టేప్ రికార్డర్ కొట్టేసింది వాడేనని మా అందరి అనుమానం.

"వాడు దీన్ని కొద్ది కాలం పెంచు కుని డబ్బుకి అమ్మేసి వుంటాడు. అది వెదుక్కుంటూ స్వామి భక్తితో వస్తే ఇంట్లోకి రానిచ్చి వుండడు" పూర్తి చేస్తారు మావారు.

తన యజమాని రైల్లో ఊరెళ్తు దారిలో ఆ రైలుకి యాక్సిడెంటై మర ణిస్తే అతను తిరిగి రావడం కోసం ఓ జపాన్ కుక్క టోక్యో రైల్వేస్టేషన్ బయటే నిద్రాహారాలు మాని వేచి వున్న కథ గుర్తుకి వచ్చింది నాకు. అది మరణించాక ఆ స్టేషన్ బయట దాని విగ్రహాన్ని ఏర్పాటు చేశారట పుర ప్రజలు.

"పాపం. పొద్దున్నించి అదేం తిన లేదు, తాగలేదు. పాలన్నం కలిపిస్తాను. పెట్టి రండి" చెప్పాను జాలిగా నే.

నేను పాత సత్తు గిన్నెలు కలిపిచ్చిన అన్నం తీసుకెళ్లి కొద్దిసేపటికి వచ్చి చెప్పారాయన.

"అది తినడం లేదు"

"అదేం?"

"ఏమో మరి. 'జూ జూ తిను' అన్నా అన్నం ముట్టలేదు. పైగా దాని కళ్ళ ల్లోంచి నీళ్లొస్తున్నాయి" చెప్పారాయన.

"అది గణేశ్ గాడి కుక్క అయి వుండదండి. అయితే వాడు బయ టికి వచ్చినప్పుడు వేచి తోకాడించేదిగా. ఇంకెవరిదో అయి వుంటుంది"

"వాడి మీద అలిగిందేమో?" అన్నా రాయన

"మనుషులు లేదా కుక్కల్లాంటి మనుషులు అలుగుతారు కాని ఎక్క డైనా కుక్కలు అలుగుతాయటండీ" నవ్వాను

"మరేం చేద్దాం?"

"రేపు చూద్దాం లెండి" చెప్పాను.

బంగాళాఖాతంలోని వాయుగుండం తీరం దాటిన గుర్తుగా హైదరాబాద్‌లో ఆ రాత్రంగా వర్షం.

అర్ధరాత్రి మెలకువ వచ్చి చూస్తే ఆ కుక్క అలాగే కూర్చుని వుంది. మావారిని లేపాను. ఆయన వెళ్లి అది బ్రతికుందో చచ్చిందో చూసి వచ్చారు. బ్రతికే వుంది.

ఉదయం నిద్ర లేచాక చెప్పారు. తెల్ల వారుజాపవున మా వారు మా లోకల్ పోలీసు స్టేషన్‌కి ఫోను చేసి ఆ కుక్క గురించి చెప్పి ఎవరి పింక్ పమేరియన్ అయినా తప్పిపోయినట్లు రిపోర్టు వస్తే అదెక్కడుందో తెలియజేయమని చెప్పా నని.

"మంచి పని చేశారండి" చెప్పాను.

ఉదయం ఎనిమిదిన్నరకి మా సందులో ఓ పోలీసు వ్యాను వచ్చి గణేశ్ ఇంటి ముందు ఆగిందని పెద్ద బ్బాయి చెప్తే ఆసక్తిగా గుమ్మం దగ్గరకి వెళ్లి తొంగి చూశాను.

పోలీసులు లోపల నుంచి గణే శ్‌ని బయటికి లాక్కొచ్చారు. ఎవరి వంకా చూడకుండా తలవంచుకుని వెళ్లి వ్యానులో కూర్చున్నాడు అతను.

మావారు గబ గబా లుంగీ విప్పి ప్యాంట్ తొడుక్కుని బయటికి వెళ్లారు– విషయం కనుక్కోవాలని. ఆ వ్యాను వెళ్లాక వచ్చారు. ఆయన మొహం ఎంతో ఎక్సయిటింగ్‌గా వుంది.

"ఏం జరిగింది?" అడిగాను.

"ఏం జరిగిందేమిటి? నిన్న మధ్యాహ్నం ఆ గణేశ్‌గాడు జూబ్లీహిల్స్ లోని ఓ ముసలాయన్ని కత్తితో చంపేసి ఇంట్లోవన్నీ దోచుకు వచ్చాట్ట. పాపం ఆ ముసలాయన ఒక్కడే ఆ ఇంట్లో వుంటాడట. భార్య లేదు, పిల్లలు న్యూజిలాండ్‌లో వుంటారుట"

"మన పోలీసులు భలే ఘటికులండీ. ఇరవై నాలుగు గంటలు కాకుండానే వీడ్ని పట్టేశారు" చెప్పాను.

ఆయన చిన్నగా నవ్వి చెప్పారు.

"అది కాదే. ఆ పింక్ పమేరియన్ ఆ ముసలాయన పెంపుడు కుక్కట"

"ఆ?"

"అవును. ఆ ముసలాయన శవం చుట్టూ అది నిన్న ఏడుస్తూ తిరగడం పోలీసులు చూశారట. నేను పింక్ పమేరియన్ గురించి నిన్న రిపోర్టు చేశాను కదా. సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయం పోలీసు స్టేషన్‌కు రాగానే ఈ విషయం తెలిసి అనుమానం మీద వచ్చారట"

"ఇంతకీ ఇది గణేశ్ పని అని ఎలా రూఢీగా తెలుసుకున్నారు?"

"వాడింట్లో కత్తి, రక్తపు దుస్తులు దొరికితేను" చెప్పారాయన.

"డాడీ. ఇప్పుడు దానికెవరు లేరుగా. ఆ పింక్ కుక్కని మనం పెంచు కుందామా?" ఆశగా అడిగింది మా చిన్నమ్మాయి.

"అవునండి. దానికి పింకీ అనే పేరు పెడదాం" సపోర్టు చేశాను నేను కూడా.

"అదేమైందోనే. పోలీసులు కూడా దాని కోసం చూశారు కాని, వాళ్లు గణేశ్‌ని అరెస్టు చేయగానే లేచి ఎటో వెళ్లిపోయింది" చెప్పారాయన. 0

